

# శ్రీ భక్తి సంజీవని

**ఇది భక్తిజ్ఞాన కర్మయోగములఁ దెలుపు మాసపత్రిక.**

ప్రతి హూణమాసారంభంబున వెలువడుచుండును.
విలేఖకుఁడు-ప్రకాశకుఁడు, వావిలికొలను-సుబ్బరావు,
(వాసుదాసుఁడు) ఒంటిమిట్ట.

"భక్తిరేవైనం గమయతి, భక్తి రేవైనం దర్శయతి
భక్తివశః పురుషః ॥" మా. శ్రుతి.
భక్తియే భగవంతుని బొందించును, ఆయనను దర్శింపఁజేయునది
భక్తియే, భగవంతుఁడు భక్తివశుఁడు.



| సంపుటము<br>6 | 1934వ సంవత్సరము ఏప్రిల్ నెల<br>శ్రీముఖనామ సం॥ చైత్ర మాసము. | సంచిక<br>4 |
|---|---|---|



## శ్రీరామానందలహరి

సీ. ప్రణవమునం దక్ష రములు మూఁడుండెడి
  ప్రాణముల్ రెండును బ్రాణియొకటి
అనిమూఁడు కలిసి యేకాక్షరంబయ్యెను
  నదియెపో బ్రహ్మమై విదితమయ్యె
వాచ్యవాచకములకు వఱలదుభేదంబు
  స్వరములు రెండు సజాతు లరయ
వ్యంజనంబైన మవర్ణంబగు విజాతి
  స్వగతభేదంబిట్లె వఱలుచుండు.
గీ. అట్లె జీవాత్మ పరమాత్మలందు నొప్పు
జాతి సామ్యంబు; ప్రకృతి విజాతియరయ;
మూఁడు గలసియు నొక్క టైపొదలుదీవు
ప్రణవమే నీవు నీవెచూప్రణవమనఁగ.

శ్రీరామ

భక్తిసంజీవనీ పాఠకమహాశయులకు నూతనసంవత్సర

## సంజీవనీ మంగళాశాసనము.

ఉత్పలమాల.

భావ మహాప్రభావ యనుభావముగా నయభావ యుక్తిసం
జీవని స్వగ్రహీతలకు భావశుభావహ భావవర్గముల్
భావమునం గలట్టుల స్వభావమున ఘటించుఁగాక స
ద్భావము పేర్మి భావభావ భావభావ ప్రతిమానభావముల్.

## వాసుదాసు విన్నపములు.

(గతసంచికాశేషము 141వ పుట చూడు.)

**27.** ప్రపంచస్వరూపా! నీవుతప్ప రెండవ పదార్థము లేదాయెఁగదా ఈ ప్రపంచ మెందుండినవచ్చెనని పిదప నాలోచించితిని. ఇట్లాలోచింపఁగా రెండువిధములు తోఁచెను. (1) కొంచెపుఁ జీఁకటిలో ముత్తెపుఁజిప్ప వెండివలె మెఱయుచుండును. దానిని జూచిన మూఢుఁడు అది ముత్తెపుఁ జిప్పయను వాస్తవ జ్ఞానములేక దృష్టిమాత్రమే ప్రమాణముగా నెంచి యజ్ఞానముచే నది వెండియని తలఁచును. అట్టులే కేవల జ్ఞానము (చిన్మాత్రము) అయిన నీవు జ్ఞేయముకావు. జ్ఞాతవు (తెలియఁబడు వాఁడవు తెలిసికొనువాఁడవు) కావనియు అవిద్య యను నొకటి కప్పుటచేఁ జిన్మాత్రముగాఁ గానరాక ప్రపంచముగాఁ గానవచ్చుచున్నావేమో యని తలఁచితినిగాని పర్యాలోచింపఁగా నది సరిగాఁ దోఁపలేదు. ఏలన :– కేవల జ్ఞానమైన నిన్ను మఱుఁగుపఱుచునది యజ్ఞానమే కదా యైయుండవలెను. ఆయజ్ఞాన మేమిగా నున్నది? ఎందున్నది? దానికి నిలువ స్థలమేది? యని యాలోచింపఁగా నీవుతప్ప వేఱుపదార్థము లేకుండుటచే నాయజ్ఞానము నీయందే యున్నదని చెప్పవలసివచ్చును. కేవల జ్ఞానమైన నీయందు నజ్ఞానము గలదనుట సూర్యునందుఁ జీఁకటియున్నదని చెప్పినట్టులగును. అది సరిగాదు.

ముత్తెపుఁజిప్పను వెండియనుకొనుటయందు నజ్ఞానము ముత్తెపుఁజిప్పయందున్నదా? చూచుమూఢునియం దున్నదా? ముత్తెపుఁజిప్పయం దది యుండెనేని నది యందఱకు వెండిగానేకదా కనఁబడవలయును. అట్లు లేదుకదా, మూఢుఁడు కాని వాని కది ముత్తెపుఁజిప్పగానే కానవచ్చుచున్నది. జ్ఞానము లేనివానికి వెండిగాఁ గానవచ్చుచున్నది. కావున నజ్ఞానమనునది చూచువానియం దున్నది గాని ముత్తెపుఁజిప్పయందు లేదు. అట్టులేనిన్నుఁ బ్రపంచముగాఁగానవచ్చునట్లు చేయు నజ్ఞానము నీయందులేదు. కావున నాయజ్ఞానమునకు నిలువ నీడలేదు.

(2) నీవు కేవల జ్ఞానముమాత్రమయి తెలిసికొను శక్తి లేనివాఁడవు జ్ఞాతవు కావేని నీవు కుండవంటి వాఁడవే. కుండ తాను గుండనని తెలిసికొనలేదు. ఇతర పదార్థమును దెలిసికొనలేదు. అది దానికి స్వభావసిద్ధమైనది. అప్పు డజ్ఞానమనునది కుండయందులేనట్లు నీయందునులేదు. కావున నజ్ఞానము నీయందుఁ గలదనియు నాకారణముచే నీవు ప్రపంచముగాఁ గానవచ్చుచున్నా వనియుఁ దలఁచుటకు నా యవివేకమే కారణమని తలఁచితిని.

(3) ముత్తెపుఁజిప్ప వెండియని నా యజ్ఞానముచే నేను దలఁచినపుడు నాయజ్ఞానము దేనిని మఱుఁగుపఱిచెను. జ్ఞానమును మఱుఁగపఱిచెనా? జ్ఞానముచేఁ దెలియఁదగు పదార్థమగు ముత్తెపుఁజిప్పను మఱుఁగుపఱిచెనా? జ్ఞానమునే మఱుఁగు పఱిచిన యెడల నది ముత్తెపుఁజిప్ప యను జ్ఞానముగాని వెండియను జ్ఞానముగాని లేకయే పోవలెను. అటుగాక కానవచ్చు పదార్థమైన ముత్తెపుఁజిప్ప మాత్రమే మఱుఁగు పడిపోయి వెండి కానవచ్చుచున్నది. అట్టులే నాయజ్ఞానముచే మఱుఁగుపడినది కేవల జ్ఞానమైన నీవుగావు. నీ స్వరూపము మఱుఁగుపడినది. అట్లుకాదేని నీవు కేవల జ్ఞానముగాక జ్ఞేయమగుదువు. ముత్తెపుఁజిప్పవలెఁ దెలియవచ్చుపదార్థ మగుదువు. అది నీవు కేవల జ్ఞానమని పూనిన నా ప్రతిజ్ఞకు హానికరమగును. కావున నీవు కేవల చిన్మాత్రము జ్ఞానముకావు.

(4) ముత్తెపుఁజిప్పను నేను వెండియని యజ్ఞానముచేఁ దలఁచినపుడు ముత్తెపుఁజిప్ప స్థానమున

వెండివచ్చి కూర్చుండుటచే ముత్తెపుఁజిప్ప నాశమై వెండిమాత్రమే కానవచ్చుచున్నది. వెండిగాఁ గానవచ్చునపుడు ముత్తెపుఁజిప్ప లేదు. ముత్తెపుఁజిప్పగాఁ గానవచ్చునపుడు వెండిలేదు. అట్టులే నీ యందు ప్రపంచ మారోపించి యజ్ఞానముచే నీవు ప్రపంచముగాఁ గానవచ్చుచున్నావందునేని నీవు నాశమైపోయి కానవచ్చు ప్రపంచమే శాశ్వతమగును. ఏలనఁ బ్రపంచము నిత్యముగదా? ప్రపంచ మెటులైన నాశమైపోనీ కాని నీనాశము నే నంగీకరింపఁజాల. కావున నజ్ఞానము నిన్ను కప్పుటచే నీవు ప్రపంచముగాఁ గానవచ్చు చున్నావనుట నా యంతఃకరణ మంగీకరింపలేదు.

(5) నీవు కేవల జ్ఞానమేయై నిన్ను మఱుఁగుపఱిచిన యజ్ఞానమును దొలఁగించుకొనుశక్తి నీయందు లేదేని, శక్తి యుండినను నట్లుచేయ సంకల్పములేదేని, నిన్ను మఱుఁగుపఱిచిన యజ్ఞానమును దొలఁగించి నిన్ను నుద్ధరించునది మఱియెందున్నది? అజ్ఞానమును దొలఁగించుకొను శక్తి నీయందు లేదాయె. అది నిత్యము కావున వదలదాయె. ఇఁకఁ గలకాలము నీగతి యంతియేకదా? నీవుండియు లేనివాఁడవేకదా?

(6) నేను ముత్తెపుఁజిప్పను జూచి వెండియని తలఁచి నపుడు నా కాప్తుఁడగువాఁడువచ్చి యిది వెండిగాదు. ముత్తెపుఁజిప్ప యని చెప్పినయెడల నాయజ్ఞానము తొలఁగిపోవుటచే ముత్తెపుఁజిప్ప ముత్తెపుఁజిప్పగాఁ గానవచ్చును. అట్టులే యీ కానవచ్చు ప్రపంచము వెండివలె మిథ్యయేకాని సత్యముగాదని యొకఁడు చెప్పినపుడు నా యజ్ఞానము పోయి నీవు కానవత్తువందునా? అప్పుడు నీవు ముత్తెపుఁజిప్పవలె జ్ఞేయము తెలియఁదగు పదార్థ మవుదువేకాని కేవలజ్ఞానము కావు. తొలఁగి పోయినది పదార్థవిషయమైన యజ్ఞానమేకాని జ్ఞానము నావరించిన యజ్ఞానముకాదు. కావున నాజ్ఞానముచేఁ గేవల జ్ఞానమైన నిన్నావరించిన మాయ తొలఁగిపోదు. ఏలన? ముత్తెపుఁజిప్ప జ్ఞేయమగు పదార్థము గావున దాని విషయమైన యజ్ఞానము దొలఁగిపోయెను. నీవో కేవలజ్ఞానమే కాని జ్ఞేయముకాదనికదా మొదటఁ బ్రతిజ్ఞచేసితిని. కావున జ్ఞానము జ్ఞేయమైన పదార్థము గుఱించిన యజ్ఞానమును దొలఁగించునుగాని జ్ఞానమును మఱుఁగుపఱిచిన యజ్ఞానమును దొలఁగింపలేదు.

(7) స్వామీ! నీవు కేవల చిన్మాత్రమేయై జ్ఞేయము కావని యంటినేని జ్ఞానముచేఁ దొలఁగిపోవు నవిద్యకు నీవు స్థానము గాఁజాలవు. ఏలన జ్ఞానముచేఁ దొలఁగిపోవు నవిద్య ముత్తెపుఁజిప్పవలె జ్ఞానమునకు విషయమై యుండవలెను. నీవు జ్ఞానమేకాని జ్ఞానమునకు విషయము కావు కావున నీయందు నవిద్యలేదు.

(8) స్వామీ! నీవు జ్ఞానము మాత్రమేయై జ్ఞేయము జ్ఞాతవు కావేని నీవిషయము నాకుఁ దెలియదు. నావిషయము నీవు తెలిసికొనలేవు. నీవు నాకుఁ దెలియరాకుండిన నేను వ్యసనపడను. కాని నాస్థితిగతులు నీవు తెలిసికొని నామొఱ నీవాలకించి నాదుఃఖము నీవు నివారింప దయలేనివాఁడ వైతివేని నీవు శవమువంటి వాఁడవేకదా? నపుంసకభర్త యింటిలోఁ బండుకొనిననేమి నడవీథిలోఁ బండుకొనిననేమి? ఇట్టినీవుండి యేమిలాభము లేకుండిన నష్టియేమి? నిద్రపోవువాని కాళ్ళకు నేను మ్రొక్క లేను నీవుండుట సత్యమేని నీయందు గుణములుండుట సత్యమే. గుణములుండెనా గుణియుండుట సత్యమే. నీవున్నాఁడవంటినా? యుండుట యనుగుణము నీయందుఁ గలదు. బ్రహ్మమంటినా పెరుఁగుట పెంచుట యను గుణములు నీయందుఁగలవు. నీవొక్క ఁడవే యందునా యేకత్వమను గుణము నీయందుఁగలదు. ఇంతయేల గుణము లేని పదార్థము గుణమును బోధింపని నామములేదు. కావున నీవు జ్ఞానస్వరూపుఁడవేకాక శ్రుతులందు నీవు చెప్పినట్లు జ్ఞానగుణమును కలవాఁడవు. ఆనందస్వరూపుఁడవేకాక యానందించు ఆనందింపఁజేయు గుణములు గలవాఁడవు. ఇట్టిశక్తి సంపన్నుఁడ వని తెలిసికదా నిన్నాశ్రయించితిని. నమోనమా ఏకశిలావాసా పాలిత వాసుదాస నమోనమః.

**28**. సర్వస్వామీ! లోకమునందు నీవుతప్ప వేఱొక్క పదార్థము లేదాయెఁగదా. నీవొకఁడవని నిన్ను గలవాఁడ నేనొకఁడ నున్నాఁడను. మన మిరువురము లేకున్న నేను నీవను పదములు కర్థములేదుగదా. ఇదిగాక నా దేహము నా యిల్లు నావాకిలి నేను తలఁచు నచేతన పదార్థములును గానవచ్చుచున్నవి. ఇవి యెక్క డివి? ఎందుండివచ్చినవి? ఇవన్నియు వేఱువేఱా అన్నియు నొకటియా యని యాలోచించితిని. ఇట్లాలోచింపఁగా నీవుతప్ప వేఱొకటి లేకుండుటచే నేనే నీవు నీవేనేను నాదేహము నీవు నీ వే నా దేహము కావున సర్వమొక్క టియే వేఱులేదని తోఁచెను. శక్తిశక్త న్యాయమున నిది సాధుభావమని తోఁచెను గాని మఱియొక విధమున నన్వయింపఁజూచిన నిందొక కష్టము గానవచ్చెను.

నీవు నిత్యుఁడవని సర్వజ్ఞుఁడవని సర్వశక్తుఁడవని ఆనంద స్వరూపుఁడవని ఆనందించువాఁడవని ఆనందింపఁజేయువాఁడవని మీఁద మనవిచేసితిని. నీవే నేనయినపక్షమున నేను నిత్యుఁడనై యుండవలెను.

అట్లులేదు. నేను బుట్టి డెబ్బది రెండేండ్లయిన దనుకొనుచున్నాను. నీకు వయస్సామాత్రమా? ఎప్పుడు పుట్టితినో యప్పుడు చచ్చుటసిద్ధము. నాతోడ నీవు చచ్చెదవా? నాకుముందు నీవులేవా? నాకువెనుక నీవుండువా? కావున నేనేనీవు నీవే నేననుట సరిగాఁదోఁపలేదు. నీవే నేనైన పక్షమున నేను సర్వజ్ఞుఁడనై సర్వానంద పూర్ణుఁడనై యుండవలెను. నాయంతటి యజ్ఞాని యేలోకమున, నేకాలమున, నేదేశమున లేఁడని నాతలంపు. ఇఁక నానందమనునది యెట్టిదో నేనెఱుఁగను. తల్లిగర్భమున నానంద మనుభవించితినా? పురిటిలో నానంద మనుభవించితినా అఱువది సంవత్సరములుగా వ్యాధిగ్రస్తుఁడనై యానంద మనుభవించి తినా? కూటికి నీళ్ళకు దేవురులాడుచు నీచసేవచేయునపుడు ఆనంద మనుభవించితినా? భార్యతోడను నెరవుల బిడ్డలతోడను నానందమనుభవించితినా? ఆనందాభాసమేకాని నిజమైన యానందము దేహధారికి నీసేవయందు ధ్యానమందు భజనయందుఁ దప్ప మఱియొక వేళ నున్నదా? ఇది యానందస్వరూపుని లక్షణమా? నేనేనీవై స్వతంత్రుఁడనైతినేని నఖండభూమండల మేలు చక్రవర్తిగాఁ బుట్టక బీదబాఁపఁడనై పుట్టి జేనెఁడు గోఁచితో మూఁడుమూరల గుడ్డతో నుండవలసిన కారణమేమి? ఎట్టి వాఁడును సుఖింపఁ గోరును గాని దుఃఖింపఁ గోరఁడుకదా? ఇట్టి దుఃఖము ఇట్టి జన్మము నాశక్తికిమించి వచ్చినదికాని నాసమ్మతిచే వచ్చినది కాదుకదా నేనుజేసిన కర్మము కారణమందువా? అచేతనకర్మము నన్నేమి చేయఁగలదు? దానిచేత నాపని చేయించువాఁడు కర్మఫలదాత యెవఁడు? కావున నా కిట్టిస్థితి గలిగించినవాఁడు నాకంటె నితరుఁడు చేతనుఁడు వేఱొకరుఁ దుండవలెను. నీవే నేనైనపక్షమున నన్ను నే నిట్టి దుర్దశలోఁ ద్రోచికొందునా? కావున నీకు నాకు భేదముగలదు. దీనివలన నిట్టిసంకటములు లేనినీవు స్వతంత్రుఁడవని నేను బరతంత్రుఁడనని తోఁచుచున్నది. నేనెవరికిఁ బరతంత్రుఁడను నీవుతప్ప వేఱొకరు లేనపుడు నీకేకదా నేను బరతంత్రుఁడనై యుండవలెను. నమోనమ ఏకశిలావాస పాలిత వాసుదాస నమోనమః.

**29.** సర్వశరీరా! యిట్లు నీకునాకు భేదముగలదని తీర్మానించుకొని యావల నీదేహముగుఱించి యాలోచించితిని. ఒక్కొ క్క వేళ నేను దింటిని, నేను వింటిని, నేను గంటిని, నేను నడచితిని. అని యీ ప్రకార మనుకొను చున్నాను. ఒక్కొ క్క వేళ నాచేయి నాకాలు నాముక్క నుకొను చున్నాను. ఇట్లు నాదేహము నేను వేఱువేఱుగా భావించు చున్నాను. దేహమేనేనా? నేనే దేహమైతినా? దేహము వేఱుపదార్థము నేను వేఱుపదార్థమనా? యని యాలోచించితిని. ఈవిధముగ నాలోచించుశక్తి నాకుఁగలదు కావున నేను జేతన మను, చేతనుఁడులేని దేహములు శవములై చేష్టాహీనములై యున్నవి. చేతనాచేతనము లెట్లొక్క టి కాఁగలవు? చేతన మచేతనముగా నెట్లు మాఱఁగలదు? అది యసాధ్యము. అదియునుగాక ఈ నాదేహము తల్లికడుపులో నుండి వచ్చినపుడు మూరెఁడుండెను. ఇప్పు డైదున్నర యడుగుల పొడువున నున్నది ఇది క్రమక్రమముగాఁ బెరుఁగుచుండుట తెలియవచ్చుచున్నది. అట్టులే నేననునది పెరుఁగుటలేదు. దేహమంత యాత్మయనుట నాస్తిక విశేషుల వాదము కావున నేనువేఱు దేహమువేఱు రెండును భిన్నతత్త్వములని తోఁచెను.

(2) యోగాభ్యాసకాలమందు నేనీ దేహమువిడిచి వెలుపలికివచ్చి యెందెందో తిరుగుచు నేనుండిన దేహమును నాకంటె భిన్నపదార్థముగాఁ నేను బ్రత్యక్షముగఁ జూచుచున్నాను ఇంటిలో నున్నవాఁడు వీధిలోనికి వచ్చి దానిని జూచి యిది యింతకుముందు నేనుండిన యిల్లనుకొనునట్లు ఇది నేనుండిన దేహమనుకొనఁ గలిగితిని. దేహమే నేనగుదునేని యిట్టిదర్శనము రాఁగలదా?

(3) పథ్యాపథ్య విచారములేక సర్వభోజ్య పదార్థము లెంతయైనఁ దినఁ గోరికకలదు. కాని తినిన దేహమునకు సరిపడదేమో యని తినుట మానుచున్నాను. నీధ్యానమో జపమో చేయవలయునని పట్టుదలగాఁ గూర్చుండును గాని కొంచెము సేపటికి నా ప్రయత్నము లేకయే కన్నులు మూఁతలుపడును. జపమాల క్రిందఁబడును. ఇట్టులే వ్రాయఁబూనినను జదువఁబూనినను నడువఁబూనినను నాయిష్టమునకు విరోధముగ దేహము ప్రవర్తించును. ఇట్టులే జ్ఞానేంద్రియ కర్మేంద్రియ మనః ప్రాణములు వర్తించుచున్నవి. నేనే దేహమైన పక్షమున నిట్లు కాఁగలదా? కావున వానికంటె నేను భిన్నుఁడనని తోఁచెను.

(4) ధ్యానకాలమున దేహజ్ఞానము పూర్తిగ విడిచినను అహమ్మను జ్ఞానము (నేనను జ్ఞానము) నన్ను వదలినదికాదు. దేహమే నేనైనపక్షమున అహమ్మను జ్ఞానమువలె దేహజ్ఞాన ముండవలెనుగదా అట్లుండుటలేదు. కావున దేహము వేఱు నేను వేఱు అని తలఁచితిని. నమోనమ ఏకశిలావాస పాలిత వాసుదాసా నమోనమః.

**30.** సర్వకారణ కారణా! పూర్వము నీవొకఁడవే సత్యపదార్థము నీవుతప్ప రెండవది లేదని తీర్మానించు కొంటిని. ఇప్పుడు నీవని, నేనని, దేహమని మూఁడు పదార్థము లేర్పడెను. ఈ రెండభిప్రాయములలో

నేదైన నొకటి యసత్యమై యుండవలెను. లేదా రెంటికి సామరస్యము కుదురవలెను. ఏదిసాధ్యమో చూతమని యాలోచించితిని. ముత్యపుఁ జిప్ప దానియందలి వెండివలె నీవు మాత్రమే సత్యము ప్రపంచమంతయు నసత్యమని తలంతునా? ఇది పరిష్క రించుకొనుటకు ముందు సత్యమన నేమో విచారింపవలసివచ్చెను. అర్థము తెలియని మాటలఁ బ్రయోగించిన లాభమేమి? సత్యము రెండువిధములు. భూత భవిష్య ద్వర్తమాన కాలములందు నిర్వికారమనఁగా మార్పులేక యేకరీతిగా నుండునది సత్యము. ఈవిధముగఁ జూచిన నీ ప్రపంచమునకుఁ బ్రలయముకలదు కావుననిది యసత్యమే. ఇఁక రెండవసత్య మెట్టిదనిన :- ప్రవాహము వంటిది. నేను గంగానదియొద్దన నిలఁబడి నదీజలమును జూచితినేని నా కీక్షణమునఁ గానవచ్చిననీళ్ళు కొన్ని క్షణములలోఁ గానరాకపోవును. అది దూరముపోయెను గాని స్వరూప నాశమైపోలేదు. నేను దొలుతఁ జూచిన నీరు కానరాలేదు. కావున గంగలోని నీళ్ళు సుడులై యలలై క్రింద మీఁదఁ బడుచున్నవి కావున గంగస్వరూప నాశమైనది. అసత్యమనవచ్చునా? గంగ పుట్టినది మొదలు సముద్రములోఁ గలియువఱకు నేదశయందున్నను గంగయను పేరుపోదు. రూపముపోదు. సముద్రములోఁ బ్రవేశించినను గంగయను నామము తెల్లనితనము పోవునేకాని జలము స్వరూపనాశమై పోదు. ఉప్పుగడ్డ నీళ్ళలో వేసితిమేని రూపము గడ్డయనుపేరు మాఱునేకాని నీళ్ళలోనుప్పు లేకపోదు. కావున నుప్పుసత్యమే. మన్ను కుండగా నైనపుడు మన్ను అనుపేరు దానిరూపము మాఱెను గాని మంటికి హానిలేదు. అదిసత్యమే. అట్టులే ముద్ద బంగారు ఆభరణమైనపుడు బంగారనుపేరు పోయెను గాని బంగారు నాశము కాలేదు. కావున నదిసత్యమే. అట్టులే మనకుఁగానవచ్చు నీ స్థూలప్రపంచము ప్రలయదశయందు సూక్ష్మావస్థచెంది భగవంతునియందు లీనమై యుండునుగాని స్వరూప నాశమైపోదు. స్వరూప నాశమైపోయిన దందునేని మరల సృష్టియేలేదు. కావునఁ బ్రపంచముగాఁ బరిణమించిన ప్రకృతి సూక్ష్మముగనో స్థూలముగనో నిత్యము సత్యము. ఈయర్థమునఁ బ్రపంచము సత్యమని తలంచితిని. అటుగాన ప్రపంచము గొడ్రాలిబిడ్డ, కుందేటికొమ్ము, ఆకాశ పుష్పము వలె నసత్యమనుట యసత్యమని తలంచితిని. నీవు సత్యమైతివేని ప్రపంచము సత్యమే. నమోనమ ఏకశిలావాస పాలిత వాసుదాసా నమోనమః.

31. జగదేక కారణా! సర్వము నీవేయని బుద్ధిచే గ్రహించినను, స్త్రీయని, పురుషుఁడని, చెట్టని, పశువని, పక్షియని యిట్టిభేదములు గంటికిఁ గానవచ్చుచున్నవి మనస్సునకుఁ దోఁచుచున్నవి. దీనిచే నీవు మఱుఁగుపడియుండుట సత్యము మఱుఁగుపడకుండిన సర్వము బ్రహ్మమనియేకదా నాకు కానరావలెను. అట్లు కానవచ్చుటలేదు కావున నేదియో నిన్ను మఱుఁగాపఱుచుట సత్యమని యంగీకరింపక తప్పదు.

ఈ మఱుఁగుపఱుచు దానినే మాయ యందురు. ఈమాయ నీశక్తియే. ఈశక్తిచేత నీవు లోకమునకు స్వస్వరూపముతోఁ గానరాఁగూడదని సంకల్పించుకొనుటచేఁ గానరాకయున్నావు. ఈమాయనే ప్రకృతి యందురు. నన్ను లోకమునకుఁ గానరాకుండ నాదేహమెట్లు చేయుచున్నదో యట్లు ప్రకృతి నీ దేహమై నిన్నుఁ గానరాకుండఁ జేయుచున్నది. ఇది నీ సంకల్పానుసారము చేయుచున్నది గాని స్వతంత్రించి నీ యాజ్ఞలేక నిన్నతిక్రమించి చేయునది కాదు. నీవు తొలఁగుమనినఁ దొలఁగును. క్రమ్మమనిన క్రమ్మును. నాదేహమునకుఁ జేయఁబడుసేవ నాసేవయని గ్రహింపఁబడునట్లు ఈ ప్రపంచమునకుఁ జేయుసేవ నీసేవయే. నీ సేవ సేయుచున్నానను దృఢజ్ఞానములేక చేసితినేని యది శవసేవయే, వ్యర్థము. ఒకవస్తువు జీఁకటి మఱుఁగుపఱుచునట్లు ఈ మాయాశక్తి నీ స్వస్వరూపమును మఱుఁగు పఱుచుచున్నది. కావున దానికిఁ దమస్సు అనిపేరు. ఇది నీకుఁ దెరవంటిది. ఈ తెరతొలఁగినఁ గాని నీవు గానరావు. ఇది నీశక్తి గావున నీవుతప్ప నితరులుదానిఁ దొలఁగింపలేరు. నీ యనుగ్రహమువచ్చి నీవై తొలఁగించిన నది తొలఁగును. నీకనుగ్రహము వచ్చుటకు నాకు నీయందుఁగల ప్రేమ భక్తి కారణము. నేను నిన్నుఁ బ్రేమించిన నీవు నన్నుఁ బ్రేమింతువు. మోఁచేయియాడిన ముంజేయి యాడును. ఈభక్తియే యాతెర తొలఁగుటకుఁ గారణమని నీవే యర్జునునకుఁ దెలిపితివిగదా. తండ్రీ యీ యప్రస్తుత ప్రసంగము సహింపుము. ఆతమస్సే ప్రకృతి యయ్యెను. సత్త్వము, రజస్సు, తమస్సు దానిగుణములు. ఈ మూఁడు గుణములు సమభాగములుగ నుండి చలనములేని స్థితిని బ్రకృతియందురు. ఇట్టిస్థితి ప్రలయమందుఁ గలుగును. సృష్టిసమయమున నీ సంకల్పశక్తి దీనియందుఁ బ్రవేశింపఁగా క్షోభము గలుగును. అప్పుడు నీవే వాని నొకదానిలో నొకటి కలుపుదువు. అప్పుడు ప్రకృతి నుండి మహత్తు (బుద్ధి) కలుగును. మహత్తు నుండి యహంకారము కలుగును. అహంకారమునుండి ఘ్రాణరసనచక్షుస్సులు, శ్రోత్రము, త్వక్కు అనుజ్ఞానేంద్రియములు ఉపస్థపాయు పాద పాణి వాక్కు లను కర్మేంద్రియములను మనస్సు శబ్దన్మాత్రము గలుగును శబ్దతన్మాత్రమునుండి యాకాశము,

శబ్దగుణముగల ఆకాశమునుండి స్పర్శతన్మాత్రము, స్పర్శతన్మాత్రము నుండి శబ్ద స్పర్శగుణములు గల వాయుమహాభూతము, కలుగును. ఆ వాయువునుండి రూపతన్మాత్రము కలుగును. రూపతన్మాత్రమునుండి శబ్ద, స్పర్శ, రూపములు గల తేజస్సు (అగ్ని) కలుగును. ఆతేజస్సునుండి రసతన్మాత్రము కలుగును. రసతన్మాత్రమునుండి శబ్ద స్పర్శ రూప రసములుగల ఉప్పుకలుగును. ఆ యుప్పునుండి గంధతన్మాత్రము దానినుండి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ గుణములుగల పృథివీ భూతము కలుగును.

ఈ పంచమహాభూతములు వేఱులేఱుగా నుండుటచేఁ గార్యము లేదని యాలోచించి నీవే వానియందుఁ బ్రవేశించి యన్నిటిని గలుపుదువు. దీనికే పంచీకరణమని పేరు.

| పృథ్వి 1 | అప్పు 1/4 | తేజస్సు 1/4 | వాయువు 1/4 | ఆకాశము 1/4 |
|---|---|---|---|---|
| అ. 1/4 | 1 | 1/4 | 1/4 | 1/4 |
| తే. 1/4 | 1/4 | 1 | 1/4 | 1/4 |
| వా. 1/4 | 1/4 | 1/4 | 1 | 1/4 |
| ఆ. 1/4 | 1/4 | 1/4 | 1/4 | 1 |

దొలుత నీ ప్రకారము కలిసి తరువాతఁ గ్రమ క్రమముగ ప్రస్తారభేదముచే నానా భాగములుగఁ గలుపుదువు. వీనికన్నిటికి నామములు, రూపములు నీవే కలిగించితివి. ఓషధులు లోనగు సమస్త భూతములు బ్రహ్మమొదలు పాషాణములు వఱకు నీ ప్రస్తారప్రకారము కలిసినకారణమునఁ గలిగినవే.

ఈ యైదును గలియని భూతము సృష్టియందు లేదు. ప్రతి పరమాణువునం దీయైదును గలిసియే యున్నవి. కావున కేవల సత్త్వముగాని కేవల రజస్సుగాని కేవల తమస్సుగాని సృష్టియందులేదు.

ఇన్ని భూతములకు ధారకుఁడై నీయంశమగు జీవుఁడున్నాఁడు. జీవప్రకృతులకు ధారకుఁడై పోషకుఁడనై నీవున్నావు. ఈవిధముగఁ జూచిన నన్నిపదార్థములం దన్నిపదార్థములు గలవు. అన్నియుఁ బంచభూత మయములేకదా. కావున నీళ్ళయందగ్నికలదు. అగ్నియందు నీళ్ళు కలవు. భాగభేదములచే వేఱు వస్తువులుగాఁ గానవచ్చుచున్నవి. ఈకారణముచేతనే యొక వస్తువును మఱియొక వస్తువుగా మార్పవచ్చు నని శాస్త్రములు చెప్పుచున్నవి. ఈ విషయము నేకదా రసశాస్త్రము బోధించునది. ఒక వస్తువును మఱియొక వస్తువుగా మార్పఁ గోరితిమేని ఆ వస్తువునందుఁ బంచభూతము లేభాగముల ప్రకారము కలసి యున్నవి మనము మార్పఁగోరిన పదార్థమునం దెట్లు కలిసి యున్నవి ప్రస్తుత పదార్థమునందు నే భూతములు తక్కు వ పడినవని తెలిసికొని యాభూతము లా భాగప్రకారము కలిపితిమేని యుద్దిష్టవస్తువు లభించును. ఇనుము రాగి బంగారుగఁ జేయువా రిట్లుగదా చేయుదురు. ఏయే భూతములు విస్తారముగఁ గలిసిన వెండియగునో యాభూతములే యాభాగ ప్రకారము కొంచెముగా ముత్తెపుఁ జిప్పయం దుండుటచే నది బయటఁబడు సందర్భములు కలిగినపుడు బయటఁ బడును ముత్తెపుఁ జిప్పయందు వెండి యెపు డెవ్వనకిఁ గానవచ్చును పలుచని చీఁకటిచే నేత్రపాటవము దగ్గినవానికిఁ గానవచ్చును తక్కి నవారికిఁ గానరాదు. పిల్లులకు, గూబలకు రాత్రులందుఁ గన్నులు కానవచ్చినట్లు మనకుఁగానవచ్చునా? ముత్తెపుఁజిప్ప యందు వెండిలక్షణము కొంచెముండుటచే నేత్రదోషము పలుచని చీఁకటి యీరెండును ముత్తెపుఁజిప్ప వెండిగాఁ గాన వచ్చుటకుఁ గారణములయ్యెను. కావున ముత్తెపుఁజిప్ప యందలి వెండి యసత్యముగాదు. కాని వెండివలె మనకది యుపయోగపడదు కావున మిథ్యయని యసత్యమని యందుము. వెండిని బూర్వము చూచినవాఁడు మాత్రమే ముత్తెపుఁజిప్పను వెండియని తలఁచునుగాని వెండిని జూడనివాఁ డట్లు తలఁపఁజాలఁడుకదా. ఇది వెండియా యని సందేహము వచ్చినపుడు దానిని బరిష్క రించునవి కన్నులు మాత్రమే కావు చేతికిఁదీసికొని తాఁకి చూచినను నిప్పులలోవేసినను సుత్తెతోఁ గొట్టినను దాని వాస్తవస్థితి యెఱుఁగనగు. కన్నులుండియుఁ జూపు లేనివానిని కన్నులు లేనివాఁడందుము చెవులుండియు వినశక్తిలేని వానికిఁ జెవులులేనందుము కాళ్ళుండియు నడువలేనివానికిఁ గాళ్ళులేవందుము. కావున మిథ్యయసత్యమనునవి ప్రయోజనమును బట్టికూడఁ జెప్పఁ బడును. కావున నీయర్థమునఁ దప్పభూతకోటియందు మిథ్య యనునదిలేదు. సర్వము సత్యమే. నీ వసత్య మైననే ప్రపంచ మసత్యమగును. నమోనమ ఏకశిలావాస పాలిత వాసుదాసా నమోనమః.

**(సశేషము).**

## సనాతన ధర్మము.

శ్రీయుత గాంధిగారి యుపదేశములు మన దేశమున నాసేతు శీతాచలము ఆబాలగోపాలము నత్యంత క్షోభము గలిగించినదనుట యెల్ల రెఱింగిన విషయమే. వీరి యుపదేశములు సనాతనధర్మ కల్పవృక్షమును సమూలము నాశముచేయుచున్నవని కొందఱు యభిప్రాయము. కొంద ఱవియే దేశాభివృద్ధికిఁ బట్టుఁగొమ్మలని చెప్పుచున్నారు. ఉభయపక్షములఁ బత్రిక లాంధ్రంబునఁదప్పఁ దక్కి న భాషల వెలువడినవి. నడిమితరగతివారు దోలాందోళిత చిత్తులై యున్నారు. వీరు దేశమంతయు గందరగోళము పట్టుచున్నను సంజీవని కుంభకర్ణ సేవ సేయుచన్నదని నిష్ఠురము లాడుచున్నారు. కొందఱు కొన్ని ప్రశ్నలు వ్రాసి పంపు చున్నారు.

1. శ్రీగాంధిగారు తాము సనాతన ధర్మనిష్ఠులమైన హిందువులమని శాస్త్రప్రకారము చెప్పుచున్నామని దేశాభివృద్ధియే తమ యుద్దేశమని చెప్పుచున్నారుగదా కొందఱు పండితుల మనువారు వారి కనుకూలురై యున్నారుగదా. వారు చెప్పినట్లు చేసిన దోషమా? దీనిని జాలమంది యడుగుచున్నారు.
2. సతాతన ధర్మమనఁగానేమి? దాని లక్షణ మెట్టిది?
3. అస్పృశ్యత సనాతన ధర్మమగునా కాదా?
4. నాలుగు వర్ణములకు, నాలు గాశ్రమములకు నాచారములకు నాలుగు పురుషార్థములకు సనాతన ధర్మములకు సంబంధము గలదా?
5. సనాతన ధర్మములు మనకు మాత్రమా? లోకమున మనుష్యులు కందఱకుఁగలదా?
6. సనాతన ధర్మము లనుష్ఠించిన లాభమేమి? అనుష్ఠింపకుండినఁ గీడేమి?
7. సనాతన ధర్మము లందఱకు సమానములా? అందు భేదములు గలవా?
8. నీతి యనఁగానేమి? ధర్మమనఁగానేమి? రెండిటికి భేదముగలదా?
9. వర్ణ జాతి విభాగమున కేమికారణము?
10. వర్ణాశ్రమధర్మములు చాలభాగము చెడినవిగదా వానిని బూర్ణముగ మానఁగూడదా? మానిన రాఁగల కీడేమి గలదు?
11. సనాతనధర్మ మెవ రెట్లనుష్ఠింపవలెను.
12. తక్కి న మతములకంటె నిదియెట్లు శ్రేష్ఠము?

ఇత్యాది ప్రశ్నలు పెక్కు లు వచ్చుచున్నవి. ఈ కారణముచేతను, భక్తి, కర్మ, జ్ఞాన యోగములకు సనాతన ధర్మము మూలాధారమగుటను వానిని గుఱించి కొంత సంజీవని సప్రమాణముగ వ్రాయుట యోగ్యమనియే తలఁచుచున్నది. విషయ ప్రాముఖ్యమునకుఁ దగినంత కార్య మది చేయఁజాలదని తోఁచు చున్నది. ఏల? పత్రికయా చిన్నది. నెలకొకసారి వెలువడునది. విషయమాచాలగొప్పది. ఒకటిన్నర సంవత్సరమున ముగిసినఁ ద్వరలోముగిసినట్లే. కావున సంజీవని యెంతని వ్రాయఁగలదు. తక్కి న భాషల యందువలె దానికని యొక ప్రత్యేక వారపత్రికయో పక్షపత్రికయో యుండుటయేబాగు.

అట్టిది వెలువడిన సంజీవని భారముతగ్గును. దేశమునందీ గందరగోళమునకు స్వధర్మాజ్ఞానమే కారణము. స్వమతజ్ఞాన ముండిన లోకు లీకలవరపాటు చెందరు. వెలుతురువచ్చినఁ జీఁకటి నశించునట్లు జ్ఞానము గలిగిన నజ్ఞానము తొలఁగును. కావున లోకులకు సనాతనధర్మ జ్ఞానము కలిగించుట శ్రేయస్క ములకు ముఖ్యకార్యము. త్యజించుటకై యధర్మలక్షణము, అవలంబించుటకై ధర్మలక్షణము రెండును శాస్త్ర ములందుఁ జెప్పఁబడినవి. ఆమార్గమే యనుసరణీయము. కావున నీమార్గ మనుసరించి సనాతన ధర్మచంద్రిక యనుపేరఁ గొంత గ్రంథము సంజీవని యిఁకమీఁదఁ బ్రకటింపఁ దలఁచినది. దీనికి గ్రంథసాహాయ్యము నిలుకడయగు నునికి నాలోచనము ముఖ్యములు. వాసుదాసుఁ డిప్పటినుండి దేశసంచారము చేయవలసి యున్నది. సంచార కాలమున గ్రంథావలోకమునకు లేఖనమునకు నేకాగ్రతకు విరామముండదు.

కావున మరల భగవదనుగ్రహమున నెందైన నేడెనిమిది మాసములైన నుండుట కలిగెనేని రామాయణ ముత్తరపీఠికయు, యోగశాస్త్రము, సనాతన ధర్మచంద్రికయుఁ బూర్తి చేయఁదలఁపుగలదు. అంతవఱ కీచంద్రిక కొంచెము కొంచెముగా వ్రాయఁబడుచుండును. ఇప్పటికంటె నొకఫారము (16 పుటలు) ఎక్కు వగాఁ బ్రకటించుటకు నాప్తు లంగీకరింపలేదు. దానికి సంవత్సరమునకు 350-0-0 ల కెక్కు వగాఁ గావలసియుండును. చందాదారు లెక్కు వగాఁ జేరిరేని ఆ ప్రయత్నము చేయఁబడును. బంగారు కత్తియని మెడగోసికొనుటెట్లు? ఇప్పుడు వచ్చుమొత్తము సంజీవనికిఁ జాలి చాలక యున్నది. అభిమానముచే భారమెక్కి

ంచికొనిన మొదటికి మోసమువచ్చును.

శ్రీరామ.

**భక్తి విజయము.**

(గతసంచికాశేషము 124వ పుట చూడు.)

**'నిధిధ్యాసితవ్యః'** ఇత్యాది వాక్యముతో సమానార్థము లగుటంజేసి "అనువిద్యవిజానాతి' అనియు **"విజ్ఞాయ ప్రజ్ఞాతం కుర్వీత"** అనియు నీమొదలగు శ్రుతివాక్యములు, వాక్యార్థ జ్ఞానము ధ్యానోపకారక మగుటవలన, దానిని **'విజ్ఞాయ'** (తెలిసికొని) అనియు, **'అనువిద్య'** (తెలిసికొని) అనియు నీ పదములచేత ననువదించుచు **'విజానాతి'** (ధ్యానించుచున్నాఁడు). అనియు **'ప్రజ్ఞాంకుర్వీత'** (ధ్యానముచేయవలసినది) అనియు నీపదముల మూలముగ ధ్యానమును విధించుచున్నది. **"ఆత్మారేవా అరే ద్రష్టవ్య శ్రోతవ్యో మన్తవ్య"** యనెడి శ్రుతివాక్యము **"శ్రోతవ్య"** యనియు "మన్తవ్య" యనియు నీపదములచే శ్రవణ మననములను అనువాద రూపముగఁ దెలియఁ జేయుచున్నది గాని వానిని విధించుచుండలేదు. ఏలయన, వేదములు అర్థములను దెలియఁజేయుటయే స్వభావములుగలవి గాన వేదాధ్యయన మొనర్చినవాఁడు వేదప్రతిపాదిత ములగు నుపయుక్తార్థములను సహజముగనే దెలిసికొనుచున్నాఁడు. అది వానికిఁ బ్రాప్తమైనదియే గాన అందులకై యొక శాస్త్రవిధి యవసరములేదు. ఆ యర్థములను దెలిసి కొనినతరువాత వాని యాథార్థ్యము నెఱుంగుటకై యాయర్థములను దనలోఁదాను మననమును జేసికొనుచున్నాఁడు గాన వానికదియును బ్రాప్తమైనదియే. అందులకై ఒక శాస్త్రవిధి యవసరములేదు. అందువలన **"నిధిధ్యాసితవ్యః"** అను పదముచేఁ జెప్పఁబడిన ధ్యానమే మోక్షసాధనముగ విధింపఁబడుచున్నది. బ్రహ్మసూత్రకారులుగూడ **"ఆవృత్తి రసకృదుపదేశాత్"** అను సూత్రమున వేదాంత వాక్యముల యందు మోక్షసాధనముగ విధింపఁబడినది ధ్యానమే యని తెలియఁ పఱిచియున్నారు. ఈ హేతువులనుబట్టి మోక్ష సాధనముగ విధింపఁబడినది ధ్యానము అనఁగా నుపాసనమని తెలియ వచ్చుచున్నది. (ఆంధ్ర శ్రీ భాష్యము).

కొంద ఱుపనిషత్తులయందు వేద-వేదన-విద్ లోనగు పదములకుఁ గేవల జ్ఞానమని యర్థముచేసి జ్ఞానమే మోక్షసాధన మనుచున్నారు. ఈశబ్దంబు లేయర్థంబున నుపనిషత్తులందుఁ బ్రయోగింపఁబడినవో విమర్శింతము.

ఛాందోగ్యోపనిషత్తునందుఁ దృతీయపాఠకము అష్టాదశఖండము ఒకటవ మంత్రము.

**"మనోబ్రహ్మే త్యుపాసీతే త్యధ్యాత్మమధాధిదేవత మాకాశమ్"**

మనస్సును బ్రహ్మముగ నుపాసింపవలయును. ఇది అధ్యాత్మము (ఆత్మసంబంధమైనది) ఆకాశమును బ్రహ్మముగా నుపాసింపవలయును. ఇది అధిదైవతము (దైవసంబంధమైనది). దీనికి శంకర భాష్యమునందు.

మనః తద్బ్రహ్మపర మిత్యుపాసీత - ఆకాశోబ్రహ్మ ఇత్యుపాసీత - మనస్సును ఆకాశమును బ్రహ్మమని యుపాసింపవలయును. అని కలదు.

ఇట్లు శ్రుతి యుపక్రమించి (ప్రారంభించి) కీర్తి యశసాబ్రహ్మవర్చసేన య ఏవంవేద యెవఁ డిట్లెఱుఁ గునో యను నుపసంహారముతో (ముగింపుతో) ముగించెను.

ఉపక్ర మోప సంహారము లేకవిధముగ ననఁగా నేకాభిప్రాయము గలవై యుండవలయునని విధి. అటుకాక ముందొకవిధము చెప్పి కడపట మఱియొకవిధము చెప్పిన నున్మత్తప్రలాప మగును. అట్టిదోష ముపనిషత్తులందు లేదు. కావున నుపక్రమ ముపాసింపవలసినదని ప్రారంభించి కడపటఁ దెలిసికొనుమని చెప్పినపు డీవిధముగ నుపాసింపుమని యర్థము చెప్పవలెను. ఇట్లు తెలసికొని యూరక కూర్చుండుమని శ్రుతియుపదేశించెననుట వెఱ్ఱిమాట. కావున నిచట వేదశబ్దమునకు పాసనమనియే యర్థము గ్రహింపవలెను.

శంకరభాష్యమున కానందగిరి టీకయందు "సంప్రత్యాధ్యాత్మిక పాదానా మధిదైవిక పాదైరధిష్ఠే యతయా సంబంధోనుచింతనీయ ఇతి దర్శితు ముపక్రమతే" ఇందు వేదశబ్ద పర్యాయముగ ననుచింతన పదము ప్రయోగింపఁబడినది. అను చింతనము జ్ఞానముకాదు. "సంకీర్తనల్ చింతనంబున నీ తొమ్మిది భక్తిమార్గముల" నని యది భక్తికి నంగము. కావున నుపాసన వేదన యనునవి యద్వైతుల యభిప్రాయ ప్రకారము కూడ సమానార్థకము లగుచున్నవి.

మఱియు ఛాందోగ్యము. 4-1-4 నందు,

యస్తద్వేద యత్సవేద సమయైతదుక్తః ॥ ఏభక్తుడు బ్రహ్మము నెఱింగెనో వానిని గుఱించియు వాఁడెఱింగిన బ్రహ్మమును గుఱించియు నేను చెప్పితిని యనెడి యుపక్రమవాక్యమున జ్ఞానమును దెలియఁ

జేయు 'వేద' యను క్రియాపదమును బ్రయోగించి **"అమమ ఏతాం భగవోదేవతాం శాధియాం దేవతా ముపాస్సే"** ఓపూజ్యుఁడా నీవేదేవత నుపాసించు చున్నావో ఆదేవతను నాకు వివరించి తెలుపుము" అను నుపసంహార వాక్యమున జ్ఞానమును దెలియఁజేయు వేద యను క్రియా పదమును బ్రయోగించుటకు బదులుగ నుపాసనమును దెలియఁజేయు **"ఉపాస్సే"** అను క్రియాపదమును బ్రయోగించి వారు.
ఛాందోగ్యము. 3-19-4 నందు,

**"సయఏత మేవం విద్వానాదిత్యం"** అనుదానికి వావిళ్ళ రామస్వామి శాస్త్రులవారు "ఇట్లు తెలిసికొన్న వారు **"బ్రహ్మము నుపాసించువారు"** అని వ్రాసిరి.

వీనివలన జ్ఞానబోధకశబ్దము లుపాసనార్థకము లని యేర్పడలేదా.
ఛాందోగ్యము 2-1-4 నందు,

**స ఏత దేవం విద్వా౯ సాధు సామే త్యుపాస్తే.**

ఏజ్ఞాని యీ విధముగ 'సాధు' , 'స్వామి' అను నీ రెండు శబ్దములను నేకముగా భావించి యుపాసించు చున్నాఁడో -

**"నసవేద అకృత్స్నో హ్యేషః"** (బృ. 3-4-7) వాఁడు (జీవు నుపాసించువాఁడు) పరమాత్మను దెలిసి కొనువాఁడు (ఉపాసించువాఁడు కాఁడు). వీఁడు (జీవుఁడు) సంపూర్ణుఁడు కాఁడు గదా. అను నుపక్రమ వాక్యమున జ్ఞానమును దెలియఁజేయు 'వేద' అను క్రియాపదము ప్రయోగించి 'ఆత్మేత్యేవోపాసీత" (పరమాత్మను ఆత్మయనియే ఉపాసకుని ప్రత్యగాత్మను ఆత్మ యనియే యుపాసించునది. అనెడి యుపసంహార వాక్యమునందు జ్ఞానమును దెలియఁజేయు వేద అను క్రియాపదము నుపయోగించుటకు మాఱుగ నుపాసన మును దెలియఁ జేయు "ఉపాసీత" అను క్రియాపదము ప్రయోగింపఁబడినది.
ఆం. శ్రీ. భాష్యము.

**"ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధిః, సత్త్వశుద్ధౌ ధ్రువా స్మృతిః । స్మృతిలంభే సర్వగ్రంథీనాం విప్రమోక్షః"** అను శ్రుతి, ధ్రువ స్మృతి = నిరంతర చింతనము మోక్షకారణముగఁ జెప్పెను. ఈ స్మృతి భక్తియే యగును గాని జ్ఞానము గాదుగదా.
ఈ విషయమునకు వాక్యకారులు.

**"వేదన ముపాసనం స్యాత్త ద్విషయే శ్రవణాత్"**

అనఁగా నన్ని యుపనిషత్తులయందు మోక్షసాధనముగ విధింపఁబడిన జ్ఞాన ముపాసనమే" అని చెప్పియున్నారు. మఱియు వారు "సకృత్ప్రత్యయం కుర్యాచ్ఛబ్దార్థస్య కృతత్వా త్ప్రయాజాదివత్" అను వాక్యమున ప్రయాజాది కర్మములవలె వేదనము నొకసారి యాచరింపవలెను. అంతమాత్రముననే విధివాక్యము సిద్ధమగును. అని పూర్వపక్షము చేసి "సిద్ధంతూపాసన శబ్దాత్" అది యుపాసన మనఁబడునది. గాన పదేపదే యాచరింపఁబడునట్టిది యనుచు **ఉపాసనమే మోక్ష సాధనమని నిర్ణయించి యున్నారు**. "ఉపాసనంస్యాత్ ధ్రువా స్మృతిః దర్శనా న్నిర్వచనాచ్చ" అనఁగా మపాసనమే ధ్రువ స్మృతి యగును. అట్లు కనఁబడుటవలనను వివరణ వాక్యము లుండుటవలనను - అనువాక్యముచే పదేపదే యాచరింపఁబడునట్టి యుపాసనారూపమగు జ్ఞానమే ధ్రువ స్మృతి యనియును వర్ణించియున్నారు. మఱియు నిట్టి ధ్రువ స్మృతిని దర్శనరూపమైన దానిఁగాఁ బ్రతిపాదించియున్నారు. దర్శన రూపమనఁగాఁ బ్రత్యక్షమగుట యని యెఱుంగునది.

ఇట్లు మోక్షసాధనమును ప్రత్యక్ష తారూపమును అగుధ్రువస్మృతియొక్క (ఉపాసనముయొక్క)(ఉపాసనము (ధ్యానము) ప్రీతి రూపమై యుండుట) విశేష రూపమును గుఱించి "నాయమాత్మా ప్రవచనేన లభ్యో నమేధయా న బహునాశ్రు తేనయమే వైషవృణుతే తేన లభ్యస్తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వాం" (ము. 3-ము. 2-ఖ. 3-వా).

అనఁగా ఈపరమాత్మ వేదాధ్యయనము చేతను, బుద్ధిచేతను, ఎక్కు వగా వినుటచేతను, పొందఁబడఁడు. అయితే ఈ పరమాత్మ యెవనినిఁ బ్రేమించుచున్నాఁడో అతఁడే యీ పరమాత్మను పొందుటకుఁ దగినవాఁడు. అట్టివానికే యీ పరమాత్మ తనస్వరూపమును బాగుగఁ గనుపఱుచు చున్నాఁడు. అని శ్రుతి చెప్పుచున్నది. "ఇందువలన శ్రవణ మనన నిధి ధ్యాసనములు మాత్రమే పరమాత్మను బొందుటకు ఉపాయములు గావనియు నీపరమాత్మచే వరింపఁబడుటయే యతనిఁ జేరుటకు ఉపాయమనియుఁ దెలుపఁబడియె. ఎక్కు వ ప్రియమైన పదార్థమేగదా వరింపఁదగినది. ఎవ్వఁడు పరమాత్మను ఎక్కు వగఁ

బ్రేమించునో వాని నాపరమాత్మయు నెక్కు వగఁ బ్రేమించును. అట్టివాఁడు తనను పొందుటకు సాధనమగు ఉపాసనమును పరమాత్మయే స్వయముగ వానికి నియ్యఁబ్రయత్నించుచున్నాఁడు. ఈ విషయమును భగవంతుఁడే స్వయముగ జెప్పియున్నాఁడు. ఎట్లన,

**శ్లో. తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకం**
**దదామి బుద్ధియోగంతం యేన మాముపయాంతితే.**

**గీతా. 10-అ. 10-శ్లో.**

ఓయర్జునుఁడా! నాయందెల్లెడల నాసక్తిగలిగి నన్ను బ్రీ తిపూర్వకముగ నా శ్రయించువారలకు నన్నుఁ జేరుట కుపయోగమగు జ్ఞానమును నేనే యిచ్చుచున్నాను. ఎందువలననఁగా :-

**శ్లో. ప్రియోహి జ్ఞానినో త్యర్థం అహం సచ మమప్రియః.**

**గీతా. 7-అ. 17-శ్లో.**

జ్ఞానియగువాఁడు నాకత్యంత ప్రియుఁడు జ్ఞానికి నేత్యంత ప్రియుఁడను. కాఁబట్టి స్మరింపఁబడు పదార్థము మిగుల ప్రియమైన దగుటంజేసి సాక్షాత్కార రూపమయిన యీ స్మ ృతియును స్వయముగ నెవనికి మిగులఁ బ్రియమైనదియో వాఁడే పరమాత్మచే వరింపఁదగినవాఁడు. అట్టిమానవుఁడే ఆపరమాత్మను బొందుచున్నాఁడు.

ఇట్టి ధ్రువమైన స్మృతియే (ఉపానమే) భక్తి యనియును బిలువఁబడుచున్నది. ఉపాసన భక్తి శబ్దములు పర్యాయశబ్దములుగదా! శ్రుతి స్మృతులుగూడ నిటులనే చెప్పు (ప్రీతిరూపమగు) చున్నవి. ఎట్లన, **"తమేవ విదిత్వా- తి మృత్యు ఉపాసనమే మేతి"** (ఆపరమాత్మనే యుపాసించి నాశరహిత భక్తియనుట.) మగు మోక్షమును బొందుచున్నాఁ డనియు, **"తమేవం విద్వానమృత ఇహభవతి నాన్యః పంథా విద్యతే- యనాయ"** (పు. సూ. 17-వా). (పరమాత్మను నివ్విధమున నుపాసించినవాఁడు నాశరహితుమగు మోక్షమును బొందు చున్నాఁడు. అందులకై వేఱొకమార్గ మెద్దియును లేదు.) అను శ్రుతివాక్యములు ఉపాసనమనంబడు భక్తియే మోక్షసాధనమని స్పష్టముగఁ జెప్పుచున్నవి. మఱియు భగవంతుఁడు స్వయముగ నిటులఁ జెప్పుచున్నాఁడు:-

**శ్లో. నాహం వేదైర్నతపసా నదానేన నచేజ్యయా**
**శక్యఏవం విధోద్రష్టుం దృష్టవానసి మాంయథా.**
**భక్త్యా త్వ నన్యయా శక్య అహమేవం విధోర్జున**
**జ్ఞాతుం ద్రష్టుంచ తత్త్వేన ప్రవేష్టుంచ పరంతప.**

**(గీతా.11-అ. 53-54-శ్లో.)**

ఓ అర్జునా! నీవు నన్నెటులు చూచితివో యటుల నెవ్వండును వేదముల నధ్యయనము చేసిగాని, తపస్సు జేసిగాని, దానము లొనరించిగాని యజ్ఞము లొనర్చిగాని నన్నుఁ గనుఁ గొననేరఁడు. అయితే అసాధారణమగు భక్తిచే నన్ను యథార్థముగఁ గనుఁగొనుచున్నాఁడు, తెలిసికొను చున్నాఁడు, మఱియుఁ బొందుచున్నాఁడు.

**శ్లో. పురుషస్సపరః పార్థ భక్త్యా లభ్యస్త్వనన్యయా.**

**(గీతా. 8-అ. 22-శ్లో.)**

ఓయి అర్జునుఁడా! అట్టి పురుషోత్తముఁడు భక్తిచేఁ బొందఁ దగినవాఁడు.

ఇట్లు ధ్రువానుస్మృతి యనంబడు భక్తికి హేతువులు యజ్ఞాది కర్మములు "యజ్ఞాది శ్రుతేరశ్వవత్" (బ్ర. సూ. 3-అ. 4-పా. 26-సూ). అను సూత్రముచే బ్రహ్మసూత్రకారులు సయితము అంగీకరించి యున్నారు. "వివిదషంతి యజ్ఞేన" ఇత్యాది శ్రుతిప్రకారము యజ్ఞాది కర్మములు బ్రహ్మజ్ఞానమునందు ఇచ్ఛగు గలుగఁ జేయుటయందు ఉపయుక్తములే. అయినను ధ్యానరూపమైనట్టిదియుఁ బ్రతిదిన మనుష్ఠింపఁబడు నట్టిదియు, అభ్యసింప నభ్యసింప నతిశయమును బొందునట్టిదియు, మరణపర్యంతము అనువర్తించునట్టి దియు నగు నావేదనము (ఉపాసనము) బ్రహ్మప్రాప్తికి సాధనభూతమయినది గానదానిం గలుగఁ జేయుటకై సమస్తములైన యాశ్రమకర్మములు యావజ్జీవము అనుష్ఠింపఁ బడవలసినవి. బ్రహ్మసూత్రకారులు గూడ "ఆప్రాయణా తత్రాపి హి దృష్టం" (బ్ర. సూ. 4-అ. 1-పా. 12-సూ.) అనెడి మాత్రమున మరణపర్యంతము ఉపాసనము ననుష్ఠింప వలసినదని చెప్పఁబోవుచున్నారు. మఱియు "అగ్నిహోత్రాదితు తత్కా ర్యాయైవ తద్దర్శనాత్" (బ్ర. సూ. 1-అ. 1-పా. 16-సూ.) అని యెడి సూత్రముచే అగ్నిహోత్రాది కర్మములు ఉ పాసనమును గలుగఁ జేయుటకై యేర్పడినవనియు, అట్లు శ్రుతియందుఁగూడ కనుఁబడుచున్నదనియు

"సహకారిత్వేనచ" (బ్ర. సూ. 3-4-పా. 33-సూ) అనియెడి సూత్రమున ఆశ్రమకర్మములు ఉపాసనమునకు సహకారులగుటం జేసి జ్ఞానిచేఁగూడ ననుష్ఠింపఁ బడవలసినవియే అనియుఁ జెప్పియుండుటచే సమస్తము లగు వర్ణాశ్రమ కర్మములను జ్ఞానోత్పత్తికి సాధనములుగ నంగీకరించి యున్నారు".

ఆం. శ్రీ. భాష్యము.

భగవద్గీతయందు జ్ఞానియన భజనపరుఁడనియే చెప్పఁ బడెను. (7-16) భక్తిలేని శుష్క జ్ఞానము వ్యర్థము. శ్రమ మాత్రఫలము.

**చతుర్విధా భజంతే మాం జనా స్సుకృతి నోర్జున**
**ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీచ భరతర్షభ.**

నలువురు పుణ్యాత్ములు నన్ను సేవింతురు. వారెవ్వరనిన :- ఆర్తుఁడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని. కావున భజనపరుఁడే - పరమ భక్తుఁడే - జ్ఞాని.

గీత భక్తియోగము 12-20 వ్యాఖ్యయందు శంకరాచార్యులు "ప్రియోహి జ్ఞానినోత్యర్థం । అని యేది సూచింపఁబడినదో అది వ్యాఖ్యానపూర్వకముగా నిట నుపసంహరింపఁ బడినది. భక్తాస్తే తేవ మే ప్రియ యని దేనివలన ధర్మ్యామృతమగు నీ భక్తియోగమును ననుష్ఠించువాఁడు భగవంతుఁడును విష్ణుఁడును పరమేశ్వరుఁడనగు నాకు మిక్కి లి ప్రియుఁడగుచున్నాఁడు. దానివలన విష్ణువుయొక్క ప్రియము పరమునగు ధామమునకుఁ బోవఁగోరు ముముక్షువు ఈ ధర్మ్యామృతమును యత్నించి ననుష్ఠింపవలయునని వాక్యార్థ" మని వ్రాసిరి.

మఱియు భ-గీ. 13-10 వ్యాఖ్యయందు. భక్తిరవ్యభిచారిణీసాచజ్ఞానమ్" అని అన్యభిచారభక్తియే జ్ఞానమని వ్రాసిరి. వాసుదేవుఁడే నాకు గతియనుట భక్తియనియు వ్రాసిరి.

కావుననే "జ్ఞానీతు పరమైకాంతీ, తదాయత్తాత్మ జీవనః తత్సంయోగగ వియోగైక సుఖదుఃఖ స్తథేకదీః." జ్ఞానియనఁగాఁ బరమైకాంత భక్తుఁడు. పరమాత్మకు స్వాధీనపడిన తనజీవనము గలవాఁడు భగవంతునితోడి సంయోగమే సుఖముగాను వియోగమే దుఃఖముగాఁ గనుచుండువాఁడు. వానియందే చింతగలిగి యుండువాఁడు.

మఱియును,

**భగవద్ధ్యాన యోగోక్తి వందనస్తుతి కీర్తనైః**
**లబ్ధాత్మా తద్గతప్రాణమనో బుద్ధీంద్రియ క్రియాః.**

ఈజ్ఞాని భగవంతుని ధ్యానించుట తన్మూలమున నవలోకించుట (లేక క్షేత్రములందుండు భగవంతునిఁ గూర్చి పోవుట) భగవ త్స్వరూపాదుల నితరుల కుపదేశించుట వందన స్తోత్రకీర్తనములు చేయుట దీనిచేత నాత్మప్రాప్తి గలవాఁడై ప్రాణ మనో బుద్ధీంద్రియ వ్యాపారములను భగవత్పరముగాఁ జేసినవాఁ డగును.

ఇట్టి భక్తునకే జ్ఞానియని పేరు. శుష్క జ్ఞానికిఁగాదు. కావుననే,

**శ్లో. తేషాం జ్ఞానీ నిత్య యుక్త, ఏక భక్తిర్విశిష్యతే**
**ప్రియోహి జ్ఞానినోత్యర్థ, మహం సచ మమప్రియః.**

**7-17.**

**ఉదారా స్సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మేమతమ్.**

ఈ నలువురిలో నాతో మీఁది శ్లోకములందుఁ జెప్పఁ బడిన ప్రకారము నిత్యసంబంధము గలవాఁడై నాయొక్క ని యందే భక్తిగల జ్ఞాని శ్రేష్ఠుఁడు. ఆ జ్ఞానికి నేను మిక్కి లి ప్రియుఁడను. ఆ జ్ఞానియు నాకుఁ బ్రియుఁడు. మీఁదఁ జెప్పిన నలువు రుత్తములే యైనను వారిలో జ్ఞాని నాయాత్మయే యని నాయభిప్రాయము.

భగవంతునితో నిట్టి విడువని సంబంధముగల భక్తుఁడగువాఁడు జ్ఞానియో నేనే బ్రహ్మము నీవే బ్రహ్మము అని యొక్క సారి విని నేను జ్ఞానినైతిని నాకవిద్య తొలఁగెను నేను బ్రహ్మమైతి ననుకొనువెఱ్ఱివాఁడు జ్ఞానియో బుద్ధిమంతు లాలోచింతురుగాక!

శుష్య వేదాంతులు నేనే బ్రహ్మము నీవే బ్రహ్మమను మాటల కర్థము తెలియఁగానే యవిద్య నాశమై పరబ్రహ్మ స్వరూపములు ప్రాప్తించెనని తలంచినను వాస్తవ జ్ఞానముగల యద్వైతు లేమిచెప్పుచున్నారో చూడుఁడు.

ఈశావాస్యోపనిషత్తు 11వ మంత్రము.

**విద్యాం చావిద్యాంచ యస్తద్వేదోభయం సహ అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయామృత మశ్నుతే.**

ఈ మంత్రమునకు శ్రీరామకృష్ణ పరమహంస మఠమునకు నధ్యక్షులుగా నుండిన శర్వానంద స్వాములవారు -

He who knows that Vidya and Avidya both together attains to the nature of the immortals through Vidya having conquered death by Avidya.

విద్యావిద్యల రెండుకూడ నెఱిఁగినవాఁడు అవిద్యవలన మృత్యువు గెలిచి విద్యవలన సమర్త్యుఁ డగుచున్నాఁడు. అని వ్రాసి.

"But the real import of this scripture seems to be that true path of emancipation lies in wedding the theory with the practice the intellictual knowledge with the work ; One divorced from the other would be barren to produce the desired end. In the original the word used the Karma is Avidya which literally means ignorance and hence secondarily it may signify any kind."

"If we take Vidya and Avidya in these senses, then the combination of the two is quite possible and absolutely desirable ; as it is a fact that the highest Brahma-Jnanam can never attained by mere conceptual knowledge, it it is not coupled with the proper devotional Upasana or Sadhana. We can take 'Amritam' to mean here the absolute of 'the relative immortality of the gods' ; and "Mrityam" would mean, as usual, the ordinary life of birth and death, caused by desires and attachments. Devotional practices or meditation (i.e. Avidya) of Brahman can destroy all desires and attachments of the mind and when they are thus destroyed, the knowledge of the Atman, that has been only intellectual before, becomes a matter of actual realisation of the soul. Hence the Sruti exhorts here the combination of the both." Isa. Page 21.

**అర్థము.**

ఈ (ఈశావాస్య) యుపనిషత్తుయొక్క వాస్తవార్థము మోక్షమునకు సత్యమైనమార్గము, సిద్ధాంతవాద మును, అనుష్ఠానముతోను బుద్ధితో గ్రహించిన జ్ఞానమును కర్మముతోను స్త్రీ పురుష సంయోగమునందువలె జతగూర్చుటగా నున్నది. ఒకటి యుండిమఱియొకటి లేకున్న నుద్దిష్టఫలము గలిగించుట యందు గొడ్డు పోవును. (భార్యలేని భర్తకు, భర్తలేని భార్యకు సంతానమెట్లు కలుగును?) మూలమునందుఁ గర్మమును దెలుపు నవిద్య యను పదము ప్రయోగింపఁబడినది. దానికి అజ్ఞానమని శబ్దార్థము. గౌణముగ నది యేవిధమైన కర్మమును భక్తి కార్యమైనను ధ్యానాభ్యాసమైనను బోధించును ధ్యానాభ్యాసమునకు నజ్ఞానమేకదా కారణము. (అద్వైతులకు భక్తి-ధ్యానము-యోగము ఇవన్నియు నజ్ఞాన కృత్యములే) అజ్ఞానము మాయలేక యేకార్యము సాధ్యముకాదు. (వారు బ్రహ్మాస్మియని - సోహమ్మని తత్త్వసి యని ధ్యానించుట కూడ నజ్ఞానము చేతను మాయా వశమున నని వారి యభిప్రాయము. ఇంతయేల? కాయిక వాచక మనోవ్యాపార మేదియైనను నజ్ఞానకార్యమే. ఆమూఁడులేనివాఁడుజ్ఞాని. యావజ్జీవమిట్లుండు వానికి మోక్షము. కలకాలము శవమువలె నిట్లుండుట సాధ్యమని వారివాదము. దీని ననుష్ఠించినవాఁ డెవఁడో).

విద్యా విద్యలకు నీయర్థము గ్రహించితిమేని రెంటికిఁ జేరిక సాధ్యమగును. మఱియు నది సంపూర్ణము గాఁ గోరఁ దగినదే. భక్తితోడి యుపాసన సాధనములతో జతకూడక పోయెనా భావనామాత్రమున నుత్తమ బ్రహ్మజ్ఞాన మేకాలమునకైన లభింపమి సత్యము (లభించునని శంకరాభిప్రాయము) భక్తి యనుష్ఠానములు ధ్యానము అవిద్య మానసిక కామములను సంగములను నాశముచేయఁగలవు. అట్లు గోరికలన్నియు నాశములయ్యేనేని అంతవఱకు బుద్ధికిమాత్రము తెలిసిన ఆత్మజ్ఞానము జీవునకు సాక్షాత్క రించును. కావున శ్రుతి యీ రెంటి సాంగత్యము పొగడుచున్నది.

**"సర్వకర్మ సన్న్యాస పూర్వకాత్ జ్ఞానాత్"**

అని వ్రాసిన శంకరాచార్యులవారి యభిప్రాయమున కిదియు గృహస్థులగు యాజ్ఞవల్క్య ఉద్దాలకులు జనక శ్వేత కేతువుల కుపదేశించుటయు జనక కేకయ చరిత్రములు ప్రత్యక్షవిరుద్ధములు. దీనిని గర్మ సముచ్చయ వాదమందురు. శాంకరాద్వైతులుతప్పఁ దక్కి న వారందఱు దీని నామోదించినవారు. శ్రీరామకృష్ణ మఠ సన్న్యాసు లద్వైతు లయినను అద్వైతి సన్న్యాసులకు లోకసంగ్రహమనునది లేకుండినను, **'లోకసంగ్రహ ధర్మంచ నైవకుర్యా న్నకారయేత్.** మ-భా. అశ్వ. అను గీత. 46-39.

**వృథాప్రలాపీయోన న్యాన్నలోకారాధనే రతః.**

**యతిధర్మము పరాశర మాధవీయము. 2.**

గర్మసముచ్చయ వాదము నంగీకరించి విరామకాలములందు లోకోపకారములైన పనులు చేయుచున్నారు. అట్టులే చేయవలయునని చెప్పుచునున్నారు. ఇది సరియైనపద్ధతి. వీరు చేయుకార్యము గృహస్థులును జేయవచ్చును. సన్న్యాస గ్రహణము కార్యసౌకర్యార్థము. విధిగాదు. ఈ కాలమున నిషిద్ధము. మన యాంధ్రసన్న్యాసులో కర్మములు చేయుచున్నారు గాని నిషిద్ధకర్మములు చేయుచున్నారు. వీరు దేహపాతానంతరము ఘోర నరకముల పాలుగాక బ్రహ్మమందు లీనమైరేని యప్పుడు జనన్మిథ్య శాస్త్రముమిథ్య యనవలయునుగాని యీలోపల నామాట మచ్చరింపనైన నధికారములేదు.

శంకరాచార్యులయంతటి వారికి సాధ్యముకానిదానిని నీ్రముక్క డిమూఁక సాధించుననుట యుస్మత్త ప్రలాపము.

జ్ఞాన మొక్క టియే మోక్షకారణమను వాదాద్వైతుల వాదముగుఱించి యనుభవాద్వైతు లేమి చెప్పుచున్నారో చూడుఁడు.

**శ్లో. బ్రహ్మైత్మైక విజ్ఞానా న్మనోనాశో నజాయతే**
**అస్మాత్తూపాసనా త్సిద్ధ్యే త్సప్రాణస్యేంద్రి యస్యచ**

బ్రహ్మాత్మైక జ్ఞానముచే మనోలయమురాదు. ఉపాసనమువలన సిద్ధించును.

**శ్లో. శ్రుణ్వంతు శతశోవాక్యం, తత్త్వమస్యాదికం మహత్**
**మన్యం తాంవా తథాతీవ్రం, వినోపాసన మోచకమ్.**

తత్త్వమసి లోనగు వాక్యములను నూర్లకొలఁ దులు విందురుగాక. తీవ్రముగా మననము చేయుదురుగాక ఉపాసనలేక మోక్షములేదు.

**శ్రుతి స్మృతి శతైః, ప్రోక్తం, బ్రహ్మధ్యాన మనుత్తమమ్**
**ఉపేక్ష్యపాద మాత్రేణ, బ్రహ్మసాక్షాత్క థంభవేత్.**

నూర్లకొలఁది శ్రుతి స్మృతివాక్యములు బ్రహ్మధ్యానము మిగులు శ్రేష్ఠమని చెప్పుచున్నవి వానినలక్ష్యముచేసి వాదము మాత్రము చేసిన బ్రహ్మసాక్షాత్కా ర మెట్లు లభించును.

**అహో మౌర్ఖ్యం మనుష్యాణాం, శ్రుత్యం తేషు స్థితేష్వపి**
**ఉపాస్యైక ప్రధానేషు, జనా బోధైక వాదినః.**

ఉపాసనము ముఖ్యమని చెప్పు వేదాంత వాక్యములెఱిఁగియు జ్ఞానమే ప్రధానమని వాదించు మనుష్యులయ్యో యెంతమూర్ఖులో.

**ఉపాసనమిదం నానా, విక్షేపావృత్తి నాశనమ్**
**అనేనైవమనోనాశో, జీవన్ముక్తిశ్చ నేతరైః.**

ఈ యుపాసనమే నానా విక్షేపవృత్తుల నాశము చేయును. మనోలయము జీవన్ముక్తి దీనివలననే కలుగును. ఇతరములవలనఁ గలుగదు.

**ఇతి విజ్ఞానవంతోపి, జనాః కేచన మోహితాః**
**జ్ఞానోదయా త్పరంకార్యం, నేత్యాహుః కించిదప్యహో**

ఈ జ్ఞానము కలవారుకూడఁ గొందఱు మోహవశమున జ్ఞానోదయమైనపిమ్మటఁ జేయవలసినకార్యమేదియు లేదనుచున్నారు. ఆహో యేమియాశ్చర్యము.

**ఉపాసనం వినాజ్ఞానా, త్కే వలాచ్చే ద్విముక్తతా**
**కన్యాంవినా వివాహస్యా, త్కే వలేన వరేణహి.**

ఉపాసనము లేక యొక జ్ఞానము చేతనే మోక్షమువచ్చుననుట కన్యలేక వరుఁడు వివాహమాడినాఁడనుట వంటిది. ఈ యభిప్రాయము అప్పయదీక్షితులకు సమ్మతము.

ప్రకృతి గుణాత్మకమైన యీ శరీరము జీవునందారోపిత మనుటయు గుణాతీతుఁ డైనఁగాని మోక్షము లేదనుటయు నంద అంగీకరించిన విషయమే. గుణాతీతుఁడగుటకు సాధనమేది యనిన?

**మాంచయో౽ వ్యభిచారేణ, భక్తియో గేన సేవతే**
**సగుణాన్ సమతీత్యైతాన్, బ్రహ్మభూయాయ కల్పతే.**

అవ్యభిచారమైన భక్తిచే నన్నెవఁడు సేవించునో వాఁడు మూఁడు గుణములను దాఁటిపోయి బ్రహ్మభూతుఁ డగుటకు సమర్థుఁ డగుచున్నాఁడు. భ-గీ. 14-26. అని, ఈ యవ్యభిచార భక్తియే జ్ఞానమని శంకరులనిరి.

**దైవీహ్యేషా గుణమయీ, మమమాయా దురత్యయా**
**మామేవయేప్రపద్యంతే, మాయామేతాం తరంతితే. భ-గీ. 7-14.**

దైవసంబంధమై త్రిగుణా త్మకమైన నామాయ (ప్రకృతి) దాఁటరానిది. నన్నెవరు ప్రపత్తిచేయుదురో వారీ మాయను దాఁటుదురు.

భగవంతుఁ డిట్లు చెప్పుచుండ భక్తిలేని జ్ఞానము చేతనే మోక్షమనుట యేమివివేకము. (ఉపా సనమనఁగా భక్తి).

అన్నము చేయుటకుఁ దెలిసినంత మాత్రమున వండితినకున్నఁ గడుపునిండునా? ఆఁకలి చచ్చునా? అన్నముచేసి తినవలసిన పనిలేదు. అన్నము దినిన నాఁకలి చచ్చునని తెలిసినంతనే యాఁకలి చచ్చునని చెప్పెడువారి తెలివి కే మనవలయును. కావుననే శ్రీభాగవతమందు.

**"భక్తి హీనంబులైన కర్మ జ్ఞాన వాచాకౌశలంబులు నిరర్థకంబులు"** అని చెప్పఁబడెను.

నారదుఁడును **'సాతు కర్మజ్ఞాన యోగే ష్యధికతరా'** కర్మజ్ఞాన యోగములకంటె భక్తియే శ్రేష్ఠమనెను. కావునఁ గర్మజ్ఞానయోగముల నంగముగాఁగల భక్తియే మోక్షసాధనము. అదియే భగవంతునిఁ బ్రపన్నునిఁ జేయును. జ్ఞానము లేకున్నను భక్తి మోక్షమిచ్చును వంటచేయుటకుఁ దెలియకున్నను అన్నము సంపాదించి తినిన నాఁకలి శమించును భక్తి యన్నమే.

**భక్తి ప్రాశస్త్యము.**

తక్కి న కర్మజ్ఞాన యోగములకంటె భక్తి ప్రశస్తమని చెప్పఁబడెను. ప్రమాణకారణము లిఁకఁ జెప్పఁ బడును.

**1. త్రిమతాచార్య సమ్మతము.**

**శ్లో. నారాయణః పరతరో వయమస్య నిత్యం**
**దాసా, అశేష జగదస్య శరీర మిత్థమ్**
**శ్రు త్యాది భిర్గుణి, దయాబ్ధి, గురూపదేశా**
**ద్ధాత్వా భ్రమం స్థిరమవాప మిహప్రబోధమ్.**

అందఱకంటె నారాయణుఁడు పరుఁడు. ఆయనకంటె గొప్పవాఁడులేఁడు. మనకు మనశరీరమువలె (ఈ సమస్తప్రపంచము) ఆయన ధారణ పోషణములకు లోపడి యున్నది. వేదములవలన నాయన కల్యాణ గుణములు గలవాఁడు. దయా సాగరుఁడు ఇట్లు గురూపదేశముచే భ్రమము దొలఁగ జ్ఞానవంతుఁడ నైతిని.

ఇట్లు విశిష్టాద్వైతులు చెప్పుదురు. దీని ననుసరించియే యామత స్థాపనాచార్యులగు శ్రీమద్రామానుజా చార్యులవారు తమ మతసిద్ధాంత గ్రంథమగు శ్రీ భాష్యమునందుఁ దొలుత,

**అఖిల భువన జన్మస్థేమ భంగాది లీలే**
**వినత వివిధ భూత వ్రాత దక్షైక దీక్షే**
**శ్రుతి శిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే**
**భవతు మమ పరస్మి౯ శేముషీ భక్తిరూపా.**

సమస్త జగముల సృష్టిస్థితి లయములు క్రీడగాఁ జేయువాఁడును, నమస్క రించు నానావిధ భూత సమూహముల రక్షణమే దీక్షగాఁ గలవాఁడును వేదశిరస్సునందుఁ బ్రకాశించువాఁడునునగు శ్రీనివాస బ్రహ్మమునందు భక్తిరూపయగు బుద్ధి నాకు లభించునుగాక యని వ్రాసిరి.

**ద్వైతి సిద్ధాంతము.**

**శ్రీమన్మధ్వమ తేహరిః, పరతర స్సత్యం జగత్తత్త్వతో**
**భేదోజీవగణా, హరేరనుచరా, నీచోచ్చభావంగతాః**
**ముక్తిర్నై జసుఖానుభూతి, రమలా భక్తిశ్చ తత్సాధనం,**
**హ్యక్షాది త్రితయంప్రమాణ, మఖిలామ్నాయైక వేద్యోహరిః.**

శ్రీ మన్మధ్వమతమందు హరి యందఱకంటె శ్రేష్ఠుఁడు జగత్తు సత్యము. జీవగణములందు భేదము యథార్థము. జీవులందఱు హరికింకరులు వారిలో నీ చోచ్చ భేదములు గలవు. నిజస్వవిభూతి యనుభవము ముక్తి. దానికి సాధనము నిర్మలభక్తి. ప్రత్యక్షానుమాన శబ్దములు ప్రమాణములు. సకల వేదములచేఁ దెలియ యోగ్యుఁడు హరి.

ఇట్లు శ్రీబలదేవాచార్యుల వారు వ్రాసిరి. శ్రీమన్మధ్వాచార్యులవారు తమ ఋగ్వేదభాష్యమందు.

**నారాయణం నిఖిలపూర్ణ గుణార్ణముచ్చ**
**మార్యామితద్యుతి మ శేషనిరస్తదోషమ్**
**సర్వేశ్వరం గురు మజేశనుతం ప్రణమ్య**
**వక్ష్యామ్య ృగర్థమతి తుష్టకరం తదస్య.**

అని వచించిరి.

అర్థము.

సమస్త పూర్ణగుణ సముద్రుఁడును సూర్యునికంటె నమితమైన కాంతిగలవాఁడును, సమస్తదోషగుణ రహితుఁడును సర్వేశ్వరుఁడును లోకగురుఁడును బ్రహ్మ శివులచే స్తోత్రము చేయఁబడిన వాఁడును నగు నారాయణునకు నమస్క రించి ఋగ్వేదార్థము చెప్పెదను.

**అద్వైత సిద్ధాంతము.**

శ్రీమచ్ఛంకరాచార్యులవారు.

**"నారాయణః పరోవ్యక్తాత్"** అవ్యక్తమునకంటెఁ బరుఁడు నారాయణుఁడని భగవద్గీతా వ్యాఖ్యారంభ మున తమ యిష్టదేవతను స్మరించి దాని కనుగుణముగ,

**"భగవతిః పరమగురోః అచ్యుతస్య శుశ్రూషామయాక్రియతే"** భగవంతుఁడు పరమగురుఁడగు నారాయణు సేవనాచేఁ జేయఁబడుచున్నది. మఱియు,

**"భగవతః సత్యప్రతిజ్ఞత్వం బుద్ధ్వాభగవద్భ క్తేరవశ్యం భావిఫలమోక్ష మవధార్య భగవచ్ఛరణైక పరాయణః భవేత్"** భగవంతుని సత్యప్రతిజ్ఞత్వ మెఱిఁగి భగవద్భక్తివలన మోక్షమవశ్యము గలుగునని నిశ్చయిం చుకొని భగవంతుని శరణమొకటే పరమగతిగాఁ గలవారు కావలెను." అని భగవద్గీతా 18-65 వ్యాఖ్యా నమందును.

**నారాయణ కరుణాలయ శరణం కరవాణి తావకౌ చరణౌ**

నారాయణా! కరుణాలయా నీచరణ ద్వంద్వమునకు శరణాగతి చేసెదనని మహావిష్ణుస్తుతియందును వచించిరి.

**మోక్షసాధన సామగ్ర్యాం భక్తి రేవగరీయసీ**

మోక్షసాధనములలో భక్తియే గొప్పది. అని యిట్లు వివేకచూడామణిమందు వచించిరి.

కావున నీమతాచార్యులు ముప్వురు విష్ణుపరత్వము భక్తిమార్గము నంగీకరించినవారే.

**ప్రస్థానత్రయ సిద్ధాంతము.**

**అపిచ సంరాధనే ప్రత్యక్షానుమానా నాభ్యామ్** బ్ర.సూ. **3-2-24.**

దీనికి శ్రీభాష్యమునం దిట్లు వ్యాఖ్యానము వ్రాయఁబడినది.

అపిచ సంరాధనే = సమ్యక్ప్రీణనే; భక్తిరూపాపన్నే నిధిధ్యాసన ఏవాస్య సాక్షాత్కా రః నాన్యత్రేతి శ్రుతి స్మృతి భ్యా మవగమ్యతే (1) నాయమాత్మా ప్రవచనేన లభ్యోనమే ధయా న బహునాశ్రుతేన యమేవైష వృణుతే తేన లభ్యస్తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వామ్. ముం. 3-2-3.

(2) జ్ఞానప్రసాదేన విశుద్ధసత్త్వ స్తతస్తు తం పశ్యతి నిష్క లం ధ్యాయమాన. ఇతి శ్రుతిః :-

**స్మృతిరపి ॥ నాహం వేదై ర్నతపసా నదానేన నచే**
**జ్యయా భక్త్యా త్వనన్యయా శక్య అహమేవం విధోర్జున**
**జ్ఞాతుంద్రష్టుంచ తత్త్వేన ప్రవేష్టుంచ పరంతపేతి ॥ భక్తి రూపా**
**పన్న మేవ ఉపాసనం సంరాధవమ్ తస్యప్రీణనమేవో క్తమ్.**
**అతో నిధి ధ్యాసనాయ బ్రహ్మస్వరూప ముపదిశత్, ద్వేవావ**
**బ్రహ్మణ ఇత్యాది శాస్త్రం బ్రహ్మణో మూర్తామూర్త రూప**
**ద్వయాది విశిష్టతాం ప్రాగసిద్ధాం నానువదితుం క్షమమ్.**

దీనికర్థ మాంధ్ర శ్రీ భాష్యమున నిట్లు వ్రాయఁబడినది.

**23. సూ. అపిసంరాధనే ప్రత్యక్షానుమానాభ్యామ్.**

టీ॥ అపి = మఱియు, సంరాధనే = సర్వేశ్వరునికి ఎక్కువ ప్రీతిని గలుగఁజేయునదియు, భక్తియనఁ బడునట్టి ధ్యానమందే (అస్య = ఈమూర్తామూర్త స్వరూపముయొక్క సాక్షాత్కా రః = సాక్షాత్కా రము, భవతి

= కలుగుచున్నది, ఏలనఁగా.) ప్రత్యక్షానుమానాభ్యామ్ = శ్రుతి స్మృతులవలన, అవగమ్యతే = తెలియుచున్నది.

**తా॥** సర్వేశ్వరునికి ఎక్కు వ ప్రీతిని గలుగఁ జేయునదియు భక్తి యనఁబడుధ్యానము ననుష్ఠించు సమయముననే అతని మూర్తామూర్త రూపముయొక్క సాక్షాత్కా రము గలుగుచున్నదని శ్రుతి స్మృతులవలనఁ దెలియుచున్నది.

శ్రీ. భా. సూత్రమునందుండు **"సంరాధన"** శబ్దమునకు **"ఎక్కు వ ప్రీతిని గలిగించునది"** యని యర్థము. అనఁగా భక్తిరూపమైనదిగా నంగీకరింపఁబడిన నిధిధ్యాసన మనుట. అట్టి నిధిధ్యాసముననే యీమూర్తామూర్త రూపముయొక్క సాక్షాత్కా రము కలుగును గాని, వేఱొకప్పుడు గలుగదు. ఇట్లు శ్రుతి స్మృతులవలనఁ దెలియుచున్నది. ఎట్లనిన 'నాయమాత్మా ప్రవచనేనలభ్యో నమేధయా నబహునా శ్రుతేనయమేవైష వృణుతేతేన లభ్యః తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వాం" (ము. 3. ఖ. 2. వా. 3.) (ఈ పరమాత్మ వేదాధ్యయనమువలనఁగాని, బుద్ధి చాతుర్యమువలనఁగాని, ఎక్కు వగా వినుటవలనఁగాని పొందఁదగినవాఁడు కాఁడు. ఎవ్వఁ డీపరమాత్మనే ప్రేమింపఁబడుచున్నాఁడో, వాఁడే యతనిఁ బొంపఁ గలఁడు. అట్టివానికే యీ పరమాత్మ తనస్వరూపమును విశదపఱుచుచున్నాఁడు). అనియు. "జ్ఞాన ప్రసాదేన విశుద్ధ సత్త్వస్తతస్తుతం పశ్యతి నిష్క ళం ధ్యాయమానః' (ము. 3. ఖ. 1. వా. 8.) అనఁగా (జ్ఞానరూపమగు ప్రకాశముచే నిర్మలమగు మనస్సుగలవాఁడయి ధ్యానముచేయువాఁడు అవయవ రహితుఁ డగు పరబ్రహ్మమును సాక్షాత్క రించుచున్నాఁడు. అనియు నీమొదలగు శ్రుతి వాక్యములవలననిట్లు తెలియుచున్నది. శ్రీభగవద్గీతలయందు.

**శ్లో.** **"నాహం వేదైర్నతపసా నదానేన సచేజ్యయా**
**జ్ఞాతుం ద్రష్టుంచ తత్త్వేన ప్రవేష్టుంచ పరంతప"**

**తా॥** ఓ అర్జునా! ఇట్టివాఁడనగు నేను వేదాధ్యయనము చేతను, తపస్సుచేతను, దానముచేతను, యాగముచేతనున్ను చూడశక్యముకాను. పొందఁదగినవాఁడనుకాను. ఓ అర్జునా! అయితే నాయెడల అసాధారణమగు భక్తిచేతఁ దెలిసికొనుటకును, తత్త్వమునఁ జూచుటకును ప్రవేశించుటకును అనఁగాఁ బొందుటకును శక్యుఁడను. ఇట్టి భక్తిరూపమును బొందిన ఉపాసనము సంరాధనమని అనఁగా మిక్కి లి ప్రీతిగలుగఁజేయునది యని పూర్వమే చెప్పఁబడియె.

**(సశేషము).**

**శ్రీరామ.**

శ్రీసీతారాముల పరిపూర్ణ కరుణాకటాక్ష వీక్షణము చేతను శ్రీరాజాఅమ్మగారి నిర్వ్యాజమగు నాదర పరిపూర్తిచే తను మందరము పూర్తికాఁబడిన శుభోదంతము సంజీవని పాఠక మహాశయులకు విన్నవించుకొనియే యున్నది. శ్రీవాసుదాస స్వామివారు చైత్రశుద్ధ పూర్ణిమ తరువాత నిచ్చట నుండి బయలు దేఱవలయు నను సంకల్పము కలవారైయుండిరి. కాని దైవసంకల్పము వేఱుగానున్న సూచనలు పొడఁగట్టుచున్నవి. శ్రీ రాజాఅమ్మగారి సన్నిధిలో శ్రీవాసుదాసస్వామి వారిదివఱలో భగవద్గీత చెప్పుచుండిన విషయము పాఠకులకుఁ దెలిసినదే. శ్రీరాజాఅమ్మగారు కార్యాంతరములఁ జెన్నపురికిఁజని యిటీవలనే తిరిగి యిచటకు విచ్చేసిరి. మరల భగవద్గీతా కాలక్షేపము జరగవలసియున్నది. మఱియు ఉత్తరకాండమున శ్రీరామచంద్రమూర్తి లీలావతారము నుజ్జగించి నిత్యవిభవాభిరాముఁడై వైకుంఠ ధామమునకు నయోధ్యాపురవాసులతో విజయము చేయుదురు. కావున శాంతియు సీతా కల్యాణమువఱకుఁ బఠనముఁజరుగవలసియున్నది. అవి జరిగిన పిమ్మటఁ బ్రయాణవిషయము లాలోచింపవచ్చునని శ్రీరాజాఅమ్మగారు శ్రీవాసుదాసస్వామివారి ప్రస్తుత ప్రయాణసంకల్పమున కనుమతింపలేదు. శ్రీస్వామివారు శ్రీ రాజాఅమ్మగారి సెలవులేక యెచటకును బయనింపఁజాలరు. తరువాతి వృత్తాంతము సంజీవని తెలుపుకొనఁగలదు.

**ఇట్లు విన్నవించు,**
**సుబ్బదాసుఁడు.**

**శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవము**
**ఒంటిమిట్ట.**

ఈ సంవత్సర చైత్రమాస శుక్లపక్ష అష్టమి మొదలు యెప్పటివలె బ్రహ్మోత్సవము జరగునని ధర్మకర్త మ-రా-శ్రీ, కొమ్మినేని అయ్యవారుచెట్టిగారు పత్రికలంపి యున్నారు. ఈ సంవత్సరము విశేషమేమన గ్రామవాసులతో వైశ్య, బలిజ సంఘమువారును తదభిమానులగు కాపులును నీయుత్సవమునఁ బాల్గొని జరపుచున్నటులఁ దెలిసినది గ్రామమంతయు నేకమై యీ కార్యము జరపుట గ్రామమునకు మంచిదినములు వచ్చినవి శ్రీస్వామి కఖండవైభవముగా నుత్సవము జరగునని యత్యంతానందము కలిగెను గాని పోయి సందర్శించి సేవించుకొను నదృష్టము లేకపోయెఁగదాయని చాలవిచారము కలిగినది. శ్రీరాజాఅమ్మగారు చెన్నపురి కేగియుండిన కారణమున భగవద్గీతా కాలక్షేపము నిలిచిపోయినది. అది జరగవలసియున్నది. శ్రీరామ నిర్యాణఘట్టమునకు శాంతి జరగవలసియున్నది. ఈకొంఁతలు పూర్తి చేసికొని పోవలసినదని శ్రీ రాజాఅమ్మగారు సెలవిచ్చినారు. శ్రీరాజాఅమ్మగారి పరిపూర్ణాదరము కతమున మందర మింతతొరలో ముగిసినది కాని యిదే యే నడిగడ్డిపాలెమునందో సత్తెనపల్లెయందో యొంటిమిట్టయందో యయిన మూఁడు సంవత్సరములకుఁ దక్కువ అయియుండదు. ఇట్టు లౌదార్యమున ననుకూలపరిస్థితు లేర్పఱిచి యన్నివిధముల వేయికన్నులఁ గనిపెట్టి యీ మహత్కార్యము గావింపఁ బరమపురుషకార స్వరూపిణియైన శ్రీరాజాఅమ్మగారి ఋణమెట్లు తీర్చికొనవచ్చునా యని పరితపించు శ్రీ వాసుదాసస్వామివారు శ్రీరాజాఅమ్మగారి ఆజ్ఞనుల్లంఘించుటెట్లు? ఈకారణములచే శ్రీవాసుదాసస్వామి వారెవ్వరు ఆహ్వానించినను పోవుట మానివేసిరి. శ్రీరాజా అమ్మగారి సెలవు అయినపిమ్మటనే యెచటకైనఁ బోవఁ గృత నిశ్చయులయి యున్నారు. ధనముండిన దేవాలయము లెన్నియైన నిర్మింపవచ్చును గాని యిది యట్టిదికాదని విజ్ఞులెఱుఁగుదురు.

శ్రీరామచంద్రమూర్తి యుద్ధమునందు సుగ్రీవాంజనేయులవలె నొంటిమిట్ట కోదండ రామస్వామి పక్షమున ననుకూల పరిస్థితు లేర్పడుటకు సిద్ధవటము తాలూకా తహశ్శీలుదారులు బ్ర. శ్రీ, టి. ఎ. ఏకాంమ్ర శాస్త్రి బి. ఎ. వారును, దేవాలయ సంఘాధ్యక్షులగు (Temple Committee President) మ-రా-శ్రీ, రాఘవరెడ్డిగారును జాలఁగృషి చేసితోడుపడియున్నారు. వీరికి సంజీవనీ అభివాదనము లొనరించుచున్నది. భగవత్కైంకర్యమునకై చేయూఁత యొసంగిన నెల్లరకు శ్రీసీతారాములిహపర సౌఖ్యము లవ్వారిగఁ బ్రసాదించెదరుగాత.

**ఇట్లు విన్నవించు,**
**దాసోహమ్.**
**సుబ్బదాసుఁడు.**